# నా చిన్నతనంలో

శ్రీమతి పి. ఆర్. మణిగారు

మాఅమ్మ బిడ్డల్లోకల్లా చిన్నప్పుడు నేనే బుద్ధిగా వుండేదాన్నని తొందరగా మాటలొచ్చి ముద్దుగా మాట్లాడేదాన్నని, పెద్దవాళ్లు చెప్పుకుంటూవుంటే ఇప్పటికీ గర్వపడుతూవుంటాను. మా నాన్నగారి స్నేహితులు వస్తూవుండేవారట మాయింటికి వాళ్లు నన్ను దగ్గరకుపిలిచి 'ట్రంకుపెట్టె' అని అనుమ్మా అంటే 'అంకుపెట్ట'నే దాన్నట. ఒకాయనపేరు గోపిశెట్టి రంగయ్య. మాయింట్లోవాళ్లంతా పేరు వదిలేసి 'గోపిశెట్ట'ని పిలిచేవారట, నాకట్లా పిలవడం సరిగ్గారాక 'గోచిపెట్ట'నే దాన్నట. ఇప్పటికీ మావాళ్లివన్నీ చెప్పుకొని నవ్వుకుంటారు

అయిదవయేడు రాగానే మాఅమ్మ మాకు చదువు చెప్పడం ప్రారంభించేది మూడు క్లాసులువరకూ యింట్లోచెప్పి, నాలుగవక్లాసుకి స్కూలులో చేర్పించేది మొదల్లోనే స్కూలుకిపంపిస్తే అ,ఆ,లు చెప్పకుండానే అలక, ఆట అని చెప్పడం ప్రారంభిస్తారని మాఅమ్మ కిష్టములేదు. అ,ఆ,లు దగ్గరనుంచి స,హ, ళ, క్షవరకూ గబగబా పలకమీద వ్రాసేశక్తి కలిగాక మొదలెట్టేది గుణింతాలు. ఇవన్నీ బాగా వచ్చాక పుస్తకము తెరిపించేది. అట్లా చెప్పబట్టే యింతవరకయినా వచ్చామని మాలో మేమనుకుంటూ వుంటా మిప్పుడిప్పుడు.

మాఅమ్మ చదువుచెప్పేటప్పుడుమాత్రము శ్రద్ధగా వినకపోయినా, దిక్కులుచూచినా, మరచిపోయినా బడితపూజచేసి వదిలిపెట్టేది. అందరూ తన్నులు తిన్నవాళ్లేనట చదువుకొనేటప్పుడు నేను తప్ప. నాకు బాగా జ్ఞాపకమున్నంతవరకూ తన్నులు తప్పించుకొనుట నిజమేగాని వొక్కసారిమాత్రము చాలా కోపంతెప్పించా మాఅమ్మకు ఆకోపం యెందుకు వచ్చిందీ, యెట్లాతగ్గిందీ, యిదంతా కొంచెము తమాషాగావుండే సమాచారమే. అందువల్ల వ్రాయడానికి తలపెట్టా.

అప్పుడు నాకయిదేళ్లు నిండుతూవున్నయి. మామూలుప్రకారము ప్రొద్దున్న తొమ్మిదిగంటలకు పలకాబలపముపుచ్చుకొని హాజరయ్యా వంటింటిదగ్గర వసారాలోకి. మాఅమ్మ నాకు చదువుచెప్పుతూవుంది వొకప్రక్క వంటచేసుకుంటూ మానాన్నకి నేచదువుకొనేవేళే కాఫీ, ఫలహారము పుచ్చుకోడానికి. మాకంతా పెసరట్లంటే చాలాయిష్టము. అందులో మావూరి పుల్లయ్యపోసే పెసరట్లు మరీబాగుంటాయి, అణా యిచ్చి రెండు పెసరట్లు తెప్పించుకొనితినందే మానాన్న కాఫీ త్రాగేవారుకారు. ఆరోజు చాలా బాగున్నాయి పెసరట్లని, అందరికన్నా చిన్నదాన్ని కదూ, అందువల్ల నాకుపెట్టందే తిన బుద్ధివెయ్యలే మానాన్నకి. నన్ను చిన్నముక్క తినివెళ్లమని పిలిచారు. అప్పుడే నేను 'చ' తప్పువ్రాసి నాలుగు చీవాట్లుతిని మళ్లీవ్రాస్తున్నా. ఇంతట్లోకే మానాన్న పిలుపు, ఒకవైపు తినాలనివుంది, యింకొకవైపు అసలే కోపంగావుందే యిప్పుడువెళ్తే యేమంటుందోనన్న భయము. ఈరెండు కారణాలతో గడబిడలాడడం కనిపెట్టారు మానాన్న. 'నేవున్నాగాతల్లీ. మీఅమ్మ

యేమీ అనదు. రానాయనా తినమ'ని అన్నారు. ఆవెంటనే 'వెళ్లావంటేచూచు యేమిజేస్తానో' అని గిరుక్కునతిరిగి వెళ్లిపోయింది మాఅమ్మ వంటింట్లోకి. వీళ్లిద్దరూ బాగానేవున్నారు, కాని నాపని 'పడితలో పడ్డ యెలుకలాగుంది' 'నేనుండగా మీఅమ్మకి నిన్ననడానికి యెన్నిగుండెలున్నాయి తల్లీ, మీఅమ్మని కొట్టాను రామ్మా'ని బ్రతిమాలి తీసుకువెళ్ళారు. మానాన్నకంత బాగున్న పెసరట్టు నానోటికి విషములాగున్నది యీ భయంచేత వుక్కిరిబిక్కిరవుతుందని మానాన్న గోలెడ్తూవున్నా వినకుండా రెండుబుగ్గల్లో కూరుకొని చెయ్యికడుక్కోడానికి దొడ్లోకవెళ్లా. ఇంతట్లోకే వచ్చేసింగి మాఅమ్మ. ముక్కలయ్యేటట్టు ఆపలక గిరాటేసేసింది బయటికి అంతటితో వూరుకుందా! ఊహూ: 'ఈరోజుమొదలుకొని నేను నీకు చదువుచెప్పను, అన్నంపెట్టను. నీదారినీది, నాదారి నాదనిగర్జించి వెళ్లిపోయింది లోపలికి. నాకాళ్లల్లో నీళ్లు తిరిగిపోతున్నాయి. చెంబక్కడే జారవిడిచేసా. మనిషినా కొయ్యబారిపోయా. ఎందుకుతిన్నానా పెసరట్టని నామనస్సులో యెవ్వరో గొణుగుతూన్నట్టనిపించింది. మానాన్నదసలే జాలిమనస్సు. నాస్థితి పరికించారు. గబగబా లోపలికివెళ్లి మాఅమ్మని యేదో అన్నారు. నాకు సరిగ్గా వినిపించలే. 'ప్రవేటుపెట్టి నేచెప్పిస్తాతల్లీ నీకు చదువ'ని అప్పుడు బ్రతిమాలినట్టే బ్రతిమాలి తీసుకొచ్చారు లోపలికి. అమ్మ కనబడి మళ్లీ యేమంటుందోన్న భయంచేత పీధరుగుమీదకి చేరుకున్నా. నాకు అన్నం మాఅక్కని పెట్టమని చెప్పేసి మానాన్న ఆఫీసుకు వెళ్లిపోయారు.

9 గంటల్లా 11 గంటలయింది. సందడివల్ల మాఅమ్మ వడ్డిస్తూవున్నట్టు గ్రహించా. "అమ్మా! చెల్లెమ్మకో," అంది పాపం మాఅక్క. దానిసంగతెత్తారంటే తగలనిస్తా ననేటప్పటికి గప్‌చిప్ అయిపోయారందరూనూ. ఎండ అరుగెక్కుతూవుంది. అట్లాగే వొదుక్కొని కూర్చున్నా. ఆకలేస్తుంది. పిలుపందే పోవడానికి గుండెలేదు

ఇట్లా తూగుతూ తూలుతూవుండగానే వొంటిగంట కొట్టారు. మానాన్న ఆఫీసునుంచి వస్తూనే, నా పీడముఖముచూసి తెలుసుకున్నారో యేమో 'ఏం తల్లీ అన్నంతినలే,' అనడిగారు. మాఅమ్మని తలుచుకుంటే వచ్చేభయంచేత నీరసముచేత మాట్లాడలేకపోయా. నా వాలకముకనిపెట్టి యింట్లోకి తీసుకువెళ్ళారు అన్నం తిన్నదీ లేనిదీ మా అక్కనడిగారు. లేదన్నట్టు చేత్తో సంజ్ఞచేసింది. నోటితోచెప్పితే విని యేమంటుందోనని తనకీ భయమే. నే వద్దంటూన్నా బలవంతంగా తనతో కూడా పెట్టించారన్నం భోజనమయినవెంటనే మానాన్న ఆఫీసుకి వెళ్లిపోతారు. నాగుండె జారిపోయింది. అయ్యో యీవొక్కపూట శెలవు పెట్టకూడదా లేకుంటే నన్నుకూడా ఆఫీసుకి తీసుకుపోకూడదా, అన్నాలోచనలతో ముగించా తినడం. ఏసంగతీ పైకిచెప్పలేకుండా నా నోరు నొక్కేసుకుపోయింది. ఇదంతా మానాన్న కేమి తెలుసు? మామూలుప్రకారము భోజనము చెయ్యాగానే వెళ్లిపోయారు. వచ్చేయేడుపు దిగమింగుకుంటూ వొకమూల చాపేసుకొని గోడతో మాట్లాడుకొంటూ నిద్రపోయా.

నాలుగయినట్టుంది. పనిమనిషి యిల్లువూడుస్తూ నన్ను లేపేసింది. కళ్లు నులుముకుంటూ తిన్నగా వీధిగుమ్మం పుచ్చుకొన్నా. ఇంతట్లోకే స్కూలునుంచి వచ్చారు మా అన్నయ్యలు. వాళ్లహడావిడిలో టీ, ఫలహారము నాకుకూడా దొరికింది.

దీపాలుపెట్టగానే మేమంతా వొకదగ్గరకూర్చుని మాఅమ్మ దేవునిమీద పాటలు చెప్పుతూవుంటే పాడేవాడుక. ఆరోజూ చాపేసుకొని మాఅన్నయ్యలు, అక్క కూర్చున్నారు. నేను మాఅక్క వెనక్కాల కూర్చున్నా. పాటలుపాడడ మయిపోగానే అంది

గదా మాఅమ్మ 'ఎవరెవరు వస్తారు నాతో చెన్న పట్నంకి' నేనూ, నేనూ అని మా యిద్దరన్నయ్యలు అక్క చేతులెత్తారు నేనా పిరికి మాటపడిపోయి నట్టు కూర్చున్నా సరే మిమ్ముగ్గుర్నీ తీసుకువెళ్తా', అంది మాఅమ్మ 'పాపం చెల్లెమ్మో' అన్నారు ముగ్గురూనూ, 'ఆ, అదెందుకూ! నామాట వినదుగా: దానవసరములేదు దానికి, వాళ్లనాయనతో యిక్కడే వుంటుంది' అననేటప్పటికి నాకు దుఃఖమాగక కెవ్వుమని యేడ్చేశా మాఅక్క కళ్లు తుడుచుకోవడం మొదలెట్టింది మాఅన్నయ్యలు తడిచేసుకున్నారు కళ్లు అందరనూ చిన్నవాళ్లమే 'శ్రుతిమించి రాగాన్ని బడ్డట్టు' గొంతుకలు హెచ్చయ్యాయి. ఇల్లు గొల్లుమంది ఎంచేతో మాఅమ్మకికూడా దుఃఖమువచ్చేసింది. గబగబావచ్చి నన్నెత్తుకొని 'యింకేడవకు, బుద్ధిగా వుంటావుకదూ, శ్రద్ధగా చదువుకొని నేచెప్పినట్టు వింటే నిన్నుకూడా తీసుకువెళ్తా పట్నం' అనంటూంటే వెక్కుతూ వెక్కుతూ 'వింటానమ్మో, వింటానమ్మో' అని లెక్కలేనన్నిమాట్లనేశా, మళ్లీ మానాన్న వచ్చేటప్పటికి మాఅమ్మ నాకన్నంతినిపిస్తూవుంది ఆశ్చర్యపోయారు. ఎట్లా సమాధానపడ్డారనేటప్పటికి మా అన్నయ్యలున్నారుగా, గొల్లుమని చెప్పేశారు జరిగిందంతా. మానాన్న నవ్వుకున్నారు. ఇకచూడండి, అప్పటినుంచి మాఅమ్మంటే హడల్ చదువు పూర్తయి స్కూలులో ప్రవేశించేదాక వొకదెబ్బతింటే ఒట్టు.

## కోయెల

శ్రీమతి గుడిపూడి ఇందుమతీదేవిగారు

గీ॥ బిడ్డలను గంటివేగాని పెంచుటెఱుగ, వకట పలుగాకిపంచల యందువిడిచి
తిరుగ మనస్సెట్లొప్పెనో తెలియరాదు, కోయిలా హాయిమీర చిగుళ్లుమెక్కి.

గీ॥ సోమరితనంబుచే నీవు ప్రేమవదలి, కన్నబిడ్డలవిడిచితి గాని కఱకు
కాకి విడువగలేదాయె గదవె పికమ, పెంచిపెద్దజేసెను తన బిడ్డలటులె.

గీ॥ నీకు బిడ్డలబెంచెడు నేర్పునీక, కాకియును నీవు బిడ్డల గనెడుకాల
మొక్కటిగజేసి యాదైవ మొసగెనీకు, పిల్లలను కాకిగూటిలో బెట్టుతెలివి.

గీ॥ గ్రుడ్డిదాకాకి యివి తనబిడ్డలంచు, నెంచె పికసంతతియటంచు నెఱుగలేదు
దానికాతెల్వి లేమి యాతండె యొసగె, నీశ్వరుడు వానికి వినోద మిట్టిపనులు.

గీ॥ పెద్దయొసంచరించు నీబిడ్డలివియటంచు, నెపుడైన గని గుఱుతించినావె
మించి కడుకూర్మితో బల్కరించినావె, మంచిపాటలువిని సంతసించినావె.

గీ॥ జంటజంటలుగాజేరి వెంటవెంట, నంటిపండెమువైచి యొండొంటిమీఱి
లీలకుత్తుకబంటిగా లేతచిగురు, మెక్కపాడెదుపాట లే చక్కబోయె?

గీ॥ ఆవసంతునివెంటనే యరిగెనొక్కొ, యింతలో పిల్లలనుగంటి వేమొయింక
పాటసాగకపోయెనో పరభృతంబ, నీకు లేదాయెబిడ్డల సాకుచింత
యింక నేయడ్డమున్నదో యెఱుగరాదు.

గీ॥ సల్లలిత పల్లవిత వృక్షశాఖలందు, పల్లెటూళ్లయందెపుడు గన్పడెదవైన
గాని నీపాటవినరాదు గదవె పికమ, పాటవంబొప్ప నొకపాట బాడవేల.

గీ॥ నిన్ను నీతల్లిబెంచదు నీవు నీదు,బిడ్డలను బెంచలేదు నీబిడ్డలంతె
వంశపారంపరిగనిట్లె వచ్చుచుండె, తాతనాటి బోలెయెగదా తరతరాన,